క్లుప్తంగా

మంత్రి సీతక్క పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

హుజూరాబాద్: పట్టణానికి చెందిన టీటీడీపీ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీలో వెంకటేశ్వర్లుతో పని చేసిన గతం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేశ్, శ్రావణ్, బాషవేని రాజేశ్, నల్లగొని రాకేశ్, విష్ణువర్ధన్, చెంచల మణిదీప్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు రజకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న రజకులు

రామడుగు: మండల కేంద్రంలోని దోభీ ఘాట్‌తో పాటుగా మడేలేశ్వరస్వామి గుడి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని రజకులు సోమవారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని 151/సీలో అరవై ఏళ్ల మడలేశ్వర స్వామి గుడి నిర్మాణం చేసుకొని దోభీఘాట్‌లో బట్టలు ఉత్కుకోవడం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థలం తనదేనని జేసీబీతో చదును చేసి కబ్జా చేశాడని, స్థలం అన్యాక్రాంతం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఢిల్లీకి తరలిన నాయకులు



రామడుగు: జాతీయ యువజన కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఢిల్లీకి తరలివెళ్లారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీద్‌ఖాన్, కార్యదర్శి వి. శ్యాం సుందర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి గొల్లె హృతిక్‌ధర్మ, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, వంశీ, దిలీప్, గణపతితో పాటు పలువురు వెళ్లారు.

కొత్తగట్టు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం ఎన్నికల అధికారి వి.నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎడ్ల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా పప్పు రాజు, కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య, కోశాధికారిగా నీలం నాగయ్య, ప్రచార కార్యదర్శిగా ఎడ్ల సంపత్, గౌరవ అధ్యక్షుడిగా పప్పు ప్రభాకర్, డైరెక్టర్లు గోపాల్, సమ్మయ్య, రెడ్డి శంకర్, పోలు శంకర్, పిట్టల తిరుపతి ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టార్గెట్ వందశాతం



పన్నులు వసూల్ చేస్తున్న బల్దియా సిబ్బంది

- పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి..!
- 30 మంది వార్డు ఆఫీసర్లతో ప్రణాళిక రూపొందించుకొని ముందుకు
- ఇంకా మూడు నెలల గడువు

హుజూరాబాద్: ఆస్తి పన్నుల వసూళ్లలో బల్దియా అధికారులు తలమునకలయ్యారు. నెల రోజులుగా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహించిన అధికారులు ఇప్పుడు ఆస్తి, నీటి, తదితర పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆస్తి పన్ను చెల్లించండి...అభివృద్ధికి సహకరించండి అనే నినాదంతో ముందుకుసాగుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొంతమేరకు పన్నుల వసూళ్లలో వెనకబడినా ప్రస్తుతం పూర్తి స్థాయిలో వసూళ్లపై దృష్టి కేంద్రీకరించారు. వందశాతం టార్గెట్‌ను రీచ్ అయ్యే విధంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకెళ్తున్నారు.

అవగాహన కల్పిస్తూ వసూళ్లు

ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా మూడు నెలల గడువు ఉండటంతో బల్దియా అధికారులు ఇప్పటి నుంచే 30 మంది వార్డు ఆఫీసర్లతో పన్నుల వసూళ్లకు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికి తిరిగి పన్నుల వసూల్ చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిస్తుంది. ఆలోగా పన్ను చెల్లిస్తే వడ్డీ పడదని పట్టణ వాసులకు బల్దియా అధికారులు అవగాహన కల్పిస్తూ వసూళ్లు చేస్తున్నారు.

ఇంటిపన్ను డిమాండ్ రూ.2.41 కోట్లు

హుజూరాబాద్ బల్దియా పరిధిలో ఇంటిపన్ను డిమాండ్ రూ. 2.41 కోట్లు, ఇప్పటివరకు రూ.1.33 కోట్లు వసూలైంది. 55.34శాతంగా నమోదైంది. అదే విధంగా నల్లా పన్ను డిమాండ్ రూ. 2.12 కోట్లు కాగా, ఇందులో ఇప్పటివరకు కేవలం రూ.10.41 లక్షలు మాత్రమే వసూలైంది. 4.88 శాతంగా నమోదైంది. తైబజార్ డిమాండ్ రూ.14.52 లక్షలు కాగా వందశాతం వసూలైంది. ప్రభుత్వ భవనాల ప్రాపర్టీ టాక్స్ డిమాండ్ రూ. 36.35 లక్షలు కాగా కేవలం రూ. 4.39 లక్షలు వసూల్ కాగా 12 శాతంగా నమోదైంది.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



ఆస్తిపన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎన్నికలు ముగియగానే అన్నిరకాల పన్నుల వసూళ్లు ముమ్మరం చేశాం. ఇందుకు 30 మంది వార్డు ఆఫీసర్లతో వసూళ్లు చేపడుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేవరకు వందశాతం వసూళ్లు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

మంత్రులను కలిసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామాల పర్యటనకు రావాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, సుందరగిరి సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, నాయకులు పూదరి వేణు, సాంబారి బాబు, గందె కొంరయ్య పలువురు ఉన్నారు.

జమ్మికుంట: సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సదయ్య, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, సీనియర్ నాయకులు పొనగంటి రవీందర్, కాంగ్రెస్ సెల్ మండల అధ్యక్షుడు రాచపల్లి రమేశ్, నాయకులు కొలుగూరి శ్రీనివాస్, శాలిగంటి వెంకటేశ్, మల్లయ్య పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న వొడితెల ప్రణవ్

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌కు కేటాయించిన బాస్(బెస్ట్ అవలేబుల్ స్కీమ్ స్కూల్) గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్కూల్‌లో విద్యార్థులకు వసతులు దుర్భరంగా ఉన్నాయని, నిర్వహణ, ఆహారం అందించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని ఇటీవల సందర్శించిన క్రమంలో తెలిసిందన్నారు. స్కూల్ నిర్వహణపై స్థానిక ఎంఈవో విడుపు శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ డీడీ కరీంనగర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విచారణ చేసి స్కూల్ గుర్తింపు రద్దు చేసి ఎంఈవో, డిడిలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల సమాఖ్య వేదిక నాయకులు పర్లపల్లి నాగరాజు, ఆవుల తిరుపతి, గట్టు సాయిరాం, మంద భాస్కర్, కొమ్ము అశోక్ కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆటోడ్రైవర్ల నిరసన ర్యాలీ



ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డామని మండలంలోని ఆటోడ్రైవర్లు సోమవారం పట్టణంలో ఆటోలతో నిరసన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో మార్కెట్ చౌరస్తా నుంచి ఆటోలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు తరలివచ్చి మెమోరాండం అందించారు. ఆటోడ్రైవర్లకు నెలకు రూ. 15 వేల జీవన భృతి అందించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాగయ్య, లక్ష్మణ్, రమేశ్, ప్రసాద్, వెంకటస్వామి, అజయ్, బాలు, తిరుపతి, సాగర్, రజాక్, గంగాధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దుష్ప్రచారం నమ్మొద్దు

జమ్మికుంట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పోటీ చేయరనే దుష్ప్రచారం నమ్మొద్దని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని ప్రతి పల్లెకు తీసుకెళ్లిన ఘనత బండి సంజయ్‌దేనని అన్నారు. ఎంపీగా పోటీ చేస్తారని, కొందరు ఆయనకు టికెట్ రాదని ప్రచారం చేస్తున్నారని, అలాంటి కుట్రలు చేసిన వారికి పార్టీలో మనుగడ ఉండదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండ్ల పాపయ్య,కోటి గణేశ్, యాంసాని సమ్మయ్య, ఎగ్గని శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం



చొప్పదండి: కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



పద్యార్చన చేస్తున్న విద్యార్థులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామిషష్ఠి పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు అయ్యప్ప మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శతక పద్యార్చన

మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్‌లో సోమవారం వందే విశ్వమాతరం పేరుతో తానా అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమం నిర్వహించారు. వంద దేశాల్లో జరిగే కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ కోల రమేశ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వర ప్రసాద్, రేణుకారాణి, నంద కుమారి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 37 వేల విరాళం

చొప్పదండి పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి సోమవారం పట్టణానికి చెందిన గుర్రం రుద్రమ, రమణారెడ్డి దంపతులు రూ. 11,116, గంగం మమత, సత్యనారాయణరెడ్డి దంపతులు రూ. 10,116, గుర్రం పద్మ, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు రూ. 11,111, గుర్రం లక్ష్మి, దామోదర్ రెడ్డి దంపతులు రూ. 5,116 విరాళం అందించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్, ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దాతలు

మరోసారి ఓటరు జాబితా సవరణ

- రేపటి నుంచి కొత్త ఓటర్ల నమోదు
- జనవరి 5 వరకు అవకాశం



చెర్లభూత్కూర్‌లో కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌వో(ఫైల్)

కరీంనగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టులో అవకాశం కల్పించింది. త్వరలో పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ-2024కు ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8 వరకు ఓటరు తుది జాబితా రూపొందించాలని ఉత్తర్వులో పేర్కొంది. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,55,054, పురుషులు 1,77,893, మహిళలు 1,77,117 మంది ఉన్నారు.

ఇంటింటికి తిరుగుతూ..

వచ్చే ఏడాది జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈనెల 20 నుంచి ఆయా గ్రామాల్లోని బీఎల్‌వోలు ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి జనవరి 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కొత్తగా ఫారం-6 దరఖాస్తు చేస్తే బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తారు.అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు పర్యాయాలు ఓటరు సవరణ కార్యక్రమాన్ని చేపట్టినా.. జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయి. తప్పులు లేని జాబితా తయారీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా.. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో అనుకున్న లక్ష్యం నీరుగారిపోతోంది. బీఎల్‌వోలు నామమాత్రంగా సర్వే చేపట్టడంతో పలు గ్రామాల్లోని జాబితాల్లో మృతుల పేర్లు వచ్చాయి. అయితే ప్రస్తుతం ఓటరు సవరణ జాబితాను పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 నింపి దరఖాస్తు చేసుకుంటే బీఎల్‌వోలు పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తారు. ఫొటో మార్పిడి, పేర్లలో తప్పులు, పుట్టిన తేదీ వివరాలను సరిచేసుకోవడం, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశముంది. దరఖాస్తులను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. అనంతరం 22 వరకు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తారు. బీఎల్‌వోలు మరోసారి ఇంటింటి సర్వే నిర్వహించిన అనంతరం ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అర్హులైన యువత తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి. గ్రామాల్లో బీఎల్‌వోలు అవగాహన కల్పించి దరఖాస్తులను స్వీకరించేలా చర్యలు చేపడతాం. మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశముంది. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నవీన్, తహసీల్దార్, కరీంనగర్‌రూరల్

సమస్యలు పరిష్కారమైందే లేదు..

- మూడు నెలలకోసారి సభలు, సమావేశాలెందుకు
- మండల సర్వసభ్య సమావేశంలో నిరసన వ్యక్తం చేసిన సభ్యులు



విద్యుత్ సమస్యలపై మాట్లాడుతున్న సర్పంచ్ జక్కుల రవి

చిగురుమామిడి: నాలుగేళ్లుగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ నేటికి పరిష్కారానికి నోచుకోలేదు, అలాంటప్పుడు ప్రతి మూడు నెలలకోసారి సభలు, సమావేశాలెందుకని మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఇందుర్తి ఎంపీటీసీ అందె స్వప్న, ముదిమాణిక్యం సర్పంచ్ జక్కుల రవి మాట్లాడుతూ... గ్రామంలో విద్యుత్ సమస్యలపై పలుమార్లు జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకరువు పెట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. నెలరోజులైతే పదవులు ఊడిపోనున్నాయని తాము ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందని ఆయా శాఖల అధికారుల తీరుపై సర్పంచులు బోయిని శ్రీనివాస్, జక్కుల రవితో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మిషన్‌భగీరథ పథకం కింద రక్షిత మంచినీరు సరిగా సరఫరా కావడంలేదని, అలాగే కొన్ని వార్డుల్లో పైపులైన్ లీకేజీలున్నాయని ఎన్నిసార్లు చెప్పిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పథకం డీఈఈ బాల్‌రాజు మాట్లాడుతూ.. లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయిస్తూనే ఉన్నామన్నారు. అలాగే గ్రామంలో విద్యుత్ లూజ్‌లైన్ల సమస్యలతో పాటు లోవోల్టేజీపై సంబంధిత ఏఈ దృష్టికి తీసుకుపోయినా నేటికి పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఇందుర్తి ఎక్స్‌రోడ్ నుంచి గ్రామం వరకు మంజూరైన బీటీరోడ్డు పనులు నేటికి ప్రారంభం కాలేదని, అలాగే విద్యుత్ కనెక్షన్ కోసం పట్టాదార్ పాసుపుస్తకం కావాలని తహసీల్దార్‌కు విన్నవించినా ఫలితం లేదని ముదిమాణిక్యం సర్పంచ్ అన్నారు. మండలంలోని 17 గ్రామాల సర్పంచ్‌లకు రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, మరో నెలరోజులైతే పదవులు పోతున్నాయని, అప్పుడేవరికి ఇస్తారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి కెనాల్ నీరు నేటికి విడుదల కాలేదని, దీంతో రైతులు పొలాలు దున్నడం కష్టమవుతుందని సర్పంచులు సన్నీల్ల వెంకటేశం, జక్కుల రవి, బోయిని శ్రీనివాస్, గుంటి మాధవి, పీచు లీలా ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ కొత్త వినీత మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు ప్రస్తావించిన ప్రతి ఒక్కదాన్ని అధికారులు సత్వరమే పరిష్కరించాలని కోరారు. అధికారులు ప్రజాప్రతినిధులకు సహాయ సహకారాలు అందిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బేతి రాజిరెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, తహసీల్దార్ నరేందర్, డీఈఈలు బాలరాజ్, రవిప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



తిమ్మాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిమ్మాపూర్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభను మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటితో కలిగే ప్రయోజనాలను ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం చేస్తున్నారు. అర్హులు లబ్ధి పొందాలని సూచిస్తున్నారు. తిమ్మాపూర్‌లో ప్రచార రథం ద్వారా పథకాలను ప్రదర్శిస్తూ వాటి గురించి అధికారులు అవగాహన కల్పించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి అభిప్రాయాలు తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్, ఎస్‌బీఐ మేనేజర్ వేణుమాధవ, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట: పట్టణంలో తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని దుర్గాకాలనీలో న్యాలకొండ రాజేశ్వరి ఇంటికి తాళంవేసి 15రోజుల క్రితం కరీంనగర్‌లో ఉంటున్న కొడుకు న్యాలకొండ వీరన్న వద్దకు వెళ్లింది. తాళం వేసిఉన్న ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. చుట్టు పక్కలవారు ఇల్లు తాళంతీసి ఉండడాన్ని గమనించి న్యాలకొండ వీరన్నకు సమాచారం ఇచ్చారు. అతను ఇంటికి చేరుకుని పరిశీలించగా, ఇంట్లో ఉన్న 11గ్రాముల బంగారం, రూ.7వేల నగదు చోరీకి గురైనట్లు సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.